క్లుప్తంగా

నేడు తాలిమీ బోర్డు ఆధ్వర్యంలో సదస్సు

న్యూశాయంపేట: జమైతుల్ ఉల్మా దీనీ తాలిమీ బోర్డు వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నస్లే నహు మే దీనీ తాలీమ్ వ హుస్నే కిర్‌దార్ కి అహెమియత్ అనే అంశంపై హనుమకొండలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో జల్సా (సదస్సు) ఆదివారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మహ్మద్ నసీరుద్దీన్ సాహెబ్ హాస్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా హిసాముద్దీన్ సనీ ఆమీల్, ముఫ్తీ ఒమర్ ఆబెదీన్ ఖాస్మీ మదనీ, పీర్ ఖాలీఖ్ అహ్మద్ సాబిర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

హన్మకొండ: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహరీ వాజ్‌పేయి 99వ జయంతిని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు తెలిపారు. ఈనెల 25న హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఉదయం రక్తదానం శిబిరం ప్రారంభమవుతుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. రక్తదాతలు, యువత, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

27న ఢిల్లీలో సహారా బాధితుల సభ

నయీంనగర్: 13కోట్ల ప్రజానీకం వద్ద వేల కోట్ల రూపాయలు దండుకొని విదేశాలకు పారిపోయిన సహారా యాజమాన్యం తీరుకు నిరసనగా ఈ నెల 27న ఢిల్లీలో 5లక్షల మంది సహారా బాధితులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా జన్ ఆందోళన్ సంఘర్ష్ న్యాయ్ మోర్చా ప్రెసిడెంట్ పూజిత తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సహారా బాధితులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇద్దరు పరిశోధకులకు డాక్టరేట్


మూడ్ రాజు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం పరిశోధకుడు మూడ్ రాజుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. వరంగల్ జిల్లా గిరిజన సాహిత్య సాంస్కృతిక అనుశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాజుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో రాజు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

స్వర్ణాకర్‌కు డాక్టరేట్


స్వర్ణాకర్

కాకతీయ యూనివర్సిటీలో మ్యాథమెటిక్స్ విభాగం పరిశోధకుడు స్వర్ణాకర్ దోర్నాలకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హైబ్రిడ్ కంప్యూటేషనల్ మెథడ్స్ ఫర్ ఎ క్లాస్ ఆఫ్ సింగ్యులర్ పర్టుబ్రేషన్ ప్రాబ్లెమ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్వర్ణాకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య పర్యవేక్షణలో స్వర్ణాకర్ తన పీహెచ్‌డీని పూర్తిచేశారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



కాజీపేట: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ అంబేడ్కర్ నగర్ కాలనీలో 60నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అల్ఫా ఓమేగా హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ చైర్మన్ బిషప్ జాన్ మార్కండేయ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిఖిల్ జాన్, బొక్క రమేష్, లక్ష్మణ్, ఐలేష్, ఆద్విక్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక రైతు

ఖిలా వరంగల్: దేశానికి వెన్నెముక రైతు అని ఏకశిల డీజీ స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి అన్నారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్‌లో వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక దుస్తుల్లో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై రైతు వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. రైతులను సమాజం గౌరవించాలని సూచించారు. అనంతరం, క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.

మంత్రిని కలిసిన జిల్లా దేవాదాయశాఖ అధికారులు

హన్మకొండ కల్చరల్: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖను జిల్లా దేవాదాయశాఖ అధికారులు శనివారం కలిశారు. మంత్రిని తన నివాసంలో వరంగల్ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, డివిజన్ పరిశీలకులు సంజీవరెడ్డి తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

కాజీపేట: వేంకటేశ్వరస్వామికి మంగళ హారతులు ఇస్తున్న భక్తులు



ఖిలా వరంగల్: సీతారామచంద్రస్వామి ఆలయంలో..



కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ముక్కోటి ఏకాదశి పూజలు

నగరవ్యాప్తంగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. పలు దేవాలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు అర్చకులు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పండితులు విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

\- సాక్షి నెట్‌వర్క్


కాజీపేట అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ పూజలు చేస్తున్న అర్చకుడు


ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో దాస్యం వినయ్‌భాస్కర్, రేవతి


కాజీపేట అర్బన్: లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కాజీపేట రైల్వే దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


వరంగల్ గోవిందరాజుల దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనంలో భక్తులు


ఖిలా వరంగల్: రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


మడికొండ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

'తూర్పు'ను అభివృద్ధి చేస్తా



వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరంగల్ నగరంలోని బట్టల బజార్ బాలనగర వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా మంత్రి సురేఖ శనివారం దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న అన్ని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కుటుంబసమేతంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో స్వాగతించారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళి


పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆవరణలోని పీవీ కాంస్య విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశానికి దిశానిర్దేశం చేసిన ప్రజ్ఞాశాలి, ఆర్థికవేత్త, బహుముఖ భాషా కోవిదుడు పీవీ అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, విజయశ్రీరజాలీ, ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మతి విక్రమ్, కాంగ్రెస్ నాయకులు సంపత్, రవీందర్, సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సారంగం, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, బయ్య స్వామి, పల్లెబోయిన అశోక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, హనుమకొండ హనుమాన్‌నగర్ -1లో పీవీ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీవాసులు శనివారం పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.

ప్రతినెలా ఉచిత వైద్య శిబిరం

హసన్‌పర్తి: గ్రామంలో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ చిర్ర సుమలత తెలిపారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడిన వారికి షుగర్, బీపీతో పాటు ఇతర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కిషన్‌రావు, డాక్టర్ మదన్ మోహన్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో స్వయంపాలన


మాట్లాడుతున్న హెచ్‌ఎంగా వ్యవహరించిన విద్యార్థిని హరిప్రియ

విద్యారణ్యపురి: హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి వారికి పాఠ్యాంశాలు బోధించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను హెచ్‌ఎం గుగులోతు నెహ్రూ అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని చెప్పారు. అందుకోసం ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదువుతూ ముందుకు సాగాలని సూచించారు.

అక్రమాలపై వినియోగదారుల కమిషనర్‌కు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న చక్రపాణి, సుదర్శన్

నయీంనగర్: వినియోగదారుల హక్కులను కాపాడాలని, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ కోరారు. ఈమేరకు ఢిల్లీలో కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ కమిషనర్ అనుపమ్ మిశ్రాను కలిసి తెలంగాణ, వరంగల్ సంబంధించిన పలు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో హానికరమైన దొడ్డు బియ్యం సరఫరా, కంటి వెలుగు బాధితులకు నష్ట పరిహారంలో తీవ్ర జాప్యం, గురుదేవా ఫైనాన్స్ సంస్థ ద్వారా మోసగించిన ప్రభుత్వ టీచర్లపై చర్యలు లేకపోవడం, ప్రభుత్వ హాస్పిటల్‌లో బాలింతలకు రూ.13వేలు ఇవ్వకుండా అధికారుల మోసం, ధరణి వల్ల మోసపోయిన వారికి నష్టపరిహారంలో జాప్యం, 9ఏళ్లలో తెలంగాణ ప్రభుత్వం వినియోగదారుల రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించకపోవడం, చౌకడిపో డీలర్ల అక్రమ నియామకాలు, ప్రైవేట్ పాల డెయిరీల అక్రమాలపై ఫిర్యాదు చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నగరవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. చిన్నారులు శాంటాక్లాజ్, ఏంజిల్ వేషధారణలో ఆకట్టుకున్నారు. పేదలకు దాతలు నూతన వస్త్రాలు, సరుకులు అందజేశారు.

\- సాక్షి నెట్‌వర్క్



హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..


హసన్‌పర్తి: దుస్తులు పంపిణీ చేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


కాజీపేట బాపూజీనగర్‌లోని ఆపిల్ ప్లే స్కూల్‌లో..


దుస్తులు అందజేస్తున్న ఆర్‌ఐ సురేందర్, పాస్టర్ కరుణాకర్


కేయూ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో..


వరంగల్ లర్నర్స్ ల్యాండ్ స్కూల్‌లో..


హనుమకొండ భవానీనగర్‌లోని సన్‌షైన్ ప్లే స్కూల్‌లో..


మడికొండలోని రైజింగ్ టెక్నో స్కూల్‌లో..


కరీమాబాద్: కివీ పాఠశాలలో..


గోపాలపురంలోని కృష్ణవేణి ప్రతిభ పాఠశాలలో..


హనుమకొండలోని స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్‌లో..

వర్సిటీ అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వాలు


ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలకు నిధులు కేటాయించటంలో విఫలమైనట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు విమర్శించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ అరకొర నిధులతో యూనివర్సిటీల్లోని సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నాయని ఎద్దేవాచేశారు. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు రత్నాకర్, చరణ్, కార్తీక్, సందీప్, రాజ్‌కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశ సేవలో ముందుండాలి


మాట్లాడుతున్న స్మృతిక్ రాజనాల

కాజీపేట రూరల్: నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి దేశ సేవలో ముందుండాలని ఛత్తీస్‌గఢ్ ఐపీఎస్ అధికారి స్మృతిక్ రాజనాల సూచించారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో ఆవరణలో స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పాలిశెట్టి ఆధ్వర్యంలో శనివారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో స్మృతిక్ మాట్లాడారు. తాను గ్యాబ్రియెల్ పూర్వ విద్యార్థినని గుర్తుచేశారు. బ్రదర్ ఆంటోని మాట్లాడుతూ స్మృతి రాజనాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. క్రిస్మస్ సందర్భంగా ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఇటలీ నుంచి బ్రదర్ మ్యాథ్యు కవీంకల్, బస్సో పియోరిన్జో, మహేశ్వర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మెళకువలు పెంపొందించుకోవాలి


డాక్టర్ సతీష్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

మామునూరు: ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకుంటే మంచి భవిష్యత్ సొంతమవుతుందని వైద్యులు సతీష్‌రాజు, భరత్‌కుమార్, గుండా నిఖిల్, సురేష్‌చంద్ర సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజినెస్ మేనేజ్‌మెంట్ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ శశిధర్, డాక్టర్ భాస్కర్‌రావు, హెచ్ఓడీ ఎంబీఏ సలీమ్ జవాని, డాక్టర్ కేసీరెడ్డి వేణు, డాక్టర్ సరోజ, భార్గవి, మురళి, శైలజ, సంతోష్‌కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తాం..



నయీంనగర్: రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదని, వాటిని సాధించేందుకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు గట్టు ప్రసాద్‌బాబు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. తన 6గ్యారంటీ హామీలను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో నాయకులు జీఎల్.శ్రీధర్, నాగవెల్లి సురేష్, కందుకూరి నరేష్, రవీందర్ గుప్తా, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 1998వ సంవత్సర పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకుని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి కిట్స్ చాప్టర్, హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కోమల్‌రెడ్డి, డాక్టర్ ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మన్నె సతీష్‌ను కలిసిన జిల్లా నేత నేహాల్

హన్మకొండ: టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర చైర్మన్ మన్నె సతీష్ కుమార్‌ను సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ముస్తాక్ నేహాల్, తదితరులు కలిశారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో రాష్ట్ర సోషల్ మీడియా రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ ఉజ్వల్ రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శులు పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు అంబాల శివకుమార్, జనంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, పెండ్యాల వంశీ కృష్ణ, ఢిల్లీ కల్యాణ్, బైరబోయిన రమేష్ యాదవ్, హేమంత్ చారి, మద్దెల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గలో అయ్యప్ప సంకీర్తన

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలో అయ్యప్పస్వాముల నగర సంకీర్తన శనివారం వైభవంగా సాగింది. మాలధారులు కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి నగర సంకీర్తనను నిర్వహించారు. సంకీర్తనలో వెలిశాల ఆనంద్, కుసుమ రాజేందర్, కూచన ఏకాంబ్రం, సామల సదానందం, పాలకోజు కర్ణాకర్, అర్చకులు శ్రీకాంతాచారి, మధుసూదనాచారి పాల్గొన్నారు.

పిలిచి.. చంపేందుకు యత్నం

హసన్‌పర్తి: బస్టాండ్‌కు రమ్మని తనను చంపేందుకు యత్నించాడని బాధితుడు వాపోయాడు. ఈమేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన జల్లి అక్షయ్, బల్సుకూరి వినయ్ అలియా రీచ్ ఇరువురు స్నేహితులు. వినయ్ తన స్నేహితుడు అక్షయ్‌కు శనివారం ఫోన్ చేసి బస్టాండ్‌కు రమ్మన్నాడు. ఇద్దరు కలిసి స్థానిక వైన్స్ షాపునకు వెళ్లాడు. బీరు తాగడానికి అక్షయ్ నిరాకరించాడు. ఈక్రమంలో వారి మధ్య పాత కక్షల విషయంలో చిన్న గొడవ జరిగింది. ఈ సంఘటనలో అక్షయ్ ముఖంపై వినయ్ బలంగా వేటు వేశాడు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న చికెన్ సెంటర్‌లోని కత్తితో దాడికి యత్నించినట్లు బాధితుడు అక్షయ్ తెలిపారు. ఘటనలో అక్షయ్ ముఖంపై బలమైన గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినయ్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.